## క్లుప్తంగా

### వైఎస్సార్ సీపీ నేతలను పరామర్శించిన దేవభక్తుని



పెనమలూరు: అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు వైఎస్సార్ సీపీ నేతలను పెనమలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కన్వీనర్ దేవభక్తుని చక్రవర్తి పరామర్శించారు. కానూరు గ్రామానికి చెందిన ఊసా సాయిబాబు, ఎండీ ఖలీల్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం తెలుసుకున్న చక్రవర్తి సోమవారం ఆ నేతలను పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు.

### నిత్యావసర కిట్ల పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం టీజీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర కిట్లు పంపిణీ చేశారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు గ్రామాల్లోని సుమారు 200ల పేద కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 2,500లు విలువజేసే బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ట్రస్ట్ చైర్మన్, పాస్టర్ తుమ్మల సత్యం మాట్లాడుతూ ఇటీవల వచ్చిన వరదల్లో కూడా టీజీఆర్ ట్రస్ట్ బాధితులకు అండగా నిలిచిందన్నారు. ట్రస్ట్ ప్రతినిధులు శ్యాం కుమార్ పాల్గొన్నారు.

### పింఛన్ లబ్ధిదారుల తనిఖీ



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో పింఛన్లను సోమవారం జిల్లా వైద్య బృందం తనిఖీ చేసింది. మున్సిపాలిటీ పరిధిలో 34 మంది బాధితులు వివిధ వ్యాధుల కారణంగా మంచం పట్టారు. వారికి గతంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేసి ఇచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంచం పట్టిన బాధితులను తనిఖీ చేయాలని ఆదేశించింది. దీంతో జిల్లా నుంచి వైద్య నిపుణుల బృందం వచ్చి లేవలేని స్థితిలో మంచానికే పరిమితమైన బాధితుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేశారు. ఆయా గ్రామాల్లో మంచంలోనే లేవలేని స్థితిలో ఉండటం గుర్తించి వివరాలు నమోదు చేసుకున్నారు.

### కల్యాణ వేదిక నిర్మాణానికి విరాళం



గన్నవరం: స్థానిక పాతగన్నవరంలోని శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణ వేదిక నిర్మాణానికి పలువురు భక్తులు ముందుకువచ్చి సుమారు రూ. లక్ష విరాళాలు అందజేశారు. సోమవారం యూఎస్ఏకు చెందిన అన్నే గోపికృష్ణ రూ. 50,116, గన్నవరానికి చెందిన ముక్కామల జగదీశ్వరరావు, రత్నకుమారి దంపతులు రూ. 51,116 విరాళాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. కమిటీ సభ్యులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

### శ్రీరామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం ఆరు గంటల నుంచి పలు దఫాలుగా స్వామి వారికి రుద్రాభిషేకం చేశారు. ఎనిమిది గంటలకు ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు పంచ హారతులు, పల్లకీసేవ నిర్వహించారు.

### తైక్వాండో పోటీలో కాంస్యం



పెనమలూరు: కానూరు స్కాట్ స్ప్రైస్ ఇంటర్నేషనల్ పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్న టి.పర్ణీత జాతీయ స్థాయిలో జరిగిన పూమ్సే తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో కాంస్య పతకం గెలిచింది. గత నెల 30వ తేదీన హైదరాబాద్‌లో జరిగిన పోటీలో ఏపీ నుంచి టి.పర్ణీత ప్రాతినిధ్యం వహించింది. ఈ మేరకు సోమవారం పాఠశాల చైర్మన్ వీరమాచినేని వంశీకృష్ణ, డైరెక్టర్ వీరమాచినేని శాంతి, సీఈవో కొడాలి జాహ్నవి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

# గేమ్స్‌బ్రాండ్.. నున్న జెడ్పీ హైస్కూల్

- క్రీడల్లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులు
- తొలిసారి రాష్ట్రస్థాయి స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డు
- జాతీయస్థాయి పోటీల్లోనూ హవా



నున్న జిల్లా పరిషత్ హైస్కూల్

విజయవాడరూరల్: బడి.. అంటే కేవలం పాఠాలు చెప్పడమే కాదు, విద్యార్థులను అన్ని రంగాల్లోనూ నిష్ణాతులుగా తీర్చిదిద్దడం. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలం నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు చదువుతోపాటు క్రీడారంగంలోనూ తిరుగులేని విజయాలను సాధిస్తున్నారు. ఫలితంగా యేటా జాతీయ క్రీడా దినోత్సవం రోజున విద్యాశాఖ ప్రధానం చేసే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డును దక్కించుకుంది. 2023–24 విద్యా సంవత్సరానికి నున్న జెడ్పీ హైస్కూల్ ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అవార్డును కైవసం చేసుకొంది. గత ఏడాది నున్న హైస్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించగా, మరో 150 మందికి పైగా విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి కృష్ణాజిల్లాకు ప్రాతినిధ్యం వహించారు. అదే దూకుడును కొనసాగించిన పాఠశాల ఈ ఏడాది ఇప్పటికే జాతీయస్థాయి పోటీలకు అర్హతను సాధించిన విద్యార్థుల సంఖ్య 22కి చేరింది.

**స్పోర్ట్స్ కోటాలో ట్రిపుల్ ఐటీలో సీట్లు**

విద్యార్థులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో అదనపు ప్రయోజనం కలిగించేలా వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడల్లో తర్ఫీదు ఇస్తున్నారు. దీంతో నున్న విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో స్పోర్ట్స్ కోటాలో సులభంగా సీట్లు సాధిస్తున్నారు. నున్న హైస్కూల్లో కుస్తీ(రెజ్లింగ్), ఫెన్సింగ్, సైక్లింగ్, బాక్సింగ్, జూడో వంటి వ్యక్తిగత క్రీడాంశాలతో పాటు హాకీ, రగ్బీ, హ్యాండ్బాల్ తదితర ఆటల్లో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. క్రీడల్లో ఉన్న విద్యార్థులకు ఉపాధ్యాయులు మంచి సహకారం అందిస్తున్నారు. ఫలితంగా విద్యార్థులు అటు చదువులోనూ, ఇటు క్రీడల్లో ప్రతిభ చాటుతున్నారు.



గతంలో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు (ఫైల్)

**విద్యార్థులు అద్భుతంగా రాణిస్తున్నారు**



మా విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు ఉపాధ్యాయ బృందం సమిష్టి కృషి కారణం. విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు తీసుకువెళ్లేందుకు ఉపాధ్యాయులు తమ వంతు సహకారం అందిస్తున్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, క్విజ్, వ్యాసరచన, డిబేట్ తదితర పోటీల్లో అద్భుతంగా రాణిస్తున్నారు.

– వి.భూపాల్‌రెడ్డి, హెచ్ఎం, నున్న హైస్కూల్

**క్రీడలతో మంచి ఆరోగ్యం**



విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించడం వల్ల వారి భవిష్యత్ బాగుంటుంది. ఆ సదుద్దేశంతోనే విద్యార్థులను క్రీడాల్లో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నాం. క్రీడల వల్ల మంచి క్రమశిక్షణ, ఆరోగ్యవంతులుగా ఉంటారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా ఎంతో అవసరం.

– టి.శ్రీలత, ఫిజికల్ డైరెక్టర్

## గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో సత్తా చాటిన ప్రొద్దుటూరు విద్యార్థినులతో ఉపాధ్యాయులు



సత్తా చాటిన తెన్నేరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు

కంకిపాడు: గ్రిగ్ మెమోరియల్ పోటీల్లో ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. పాఠశాల హెచ్ఎం ఎం.అరుణకుమారి విద్యార్థినులను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత నెల 31, ఈనెల ఒకటవ తేదీల్లో ఆకునూరు జెడ్పీ పాఠశాలలో 84వ గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీలు నిర్వహించారని తెలిపారు. తమ విద్యార్థులు సీనియర్ బాలికల విభాగంలో వాలీబాల్, షటిల్‌లో ప్రథమ స్థానంలోనూ, కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారన్నారు. జూనియర్స్ కేటగిరీలో వాలీబాల్, షటిల్‌లో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని చెప్పారు. కోఆప్టెడ్ సభ్యుడు వై.బుల్లయ్య విద్యార్థులను ప్రోత్సహిస్తూ రూ. రెండు వేలు నగదు అందించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు వీరంకి రమేష్‌ను ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పి.నాగమణి అభినందించారు.

**సబ్‌జోన్‌లో రాణించిన తెన్నేరు విద్యార్థులు**

పెనమలూరు సబ్‌జోన్ క్రీడా పోటీల్లో తెన్నేరు జెడ్పీ పాఠశాల విద్యార్థులు రాణించారు. ఈ మేరకు విద్యార్థులను స్థానిక పాఠశాలలో సోమవారం అభినందించారు. పాఠశాల హెచ్ఎం రోజ్‌మేరీ మాట్లాడుతూ ఈడుపుగల్లులో నిర్వహించిన బాలుర ఆటల పోటీల్లో జూనియర్స్ కేటగిరీలో బాల్ బ్యాడ్మింటన్, ఖోఖోలో మొదటి స్థానం, ఆకునూరులో నిర్వహించిన బాలికల పోటీల్లో జూనియర్స్ బాలికల విభాగంలో బాల్ బ్యాడ్మింటన్, షటిల్‌లో మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారని పేర్కొన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు మిరియాల సాయికుమార్‌ను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ లంక నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

## నెప్పల్లిలో అర్ధరాత్రి ఉద్రిక్తత

- ఎస్సీ, మైనార్టీ వర్గాల మధ్య వివాదం
- రంగంలోకి దిగిన పోలీసు, రెవెన్యూ, పంచాయతీ యంత్రాంగం


కంకిపాడు: విగ్రహం ఏర్పాటు అంశం రెండు సామాజిక వర్గాల మధ్య వివాదానికి తెరతీసింది. దీంతో నెప్పల్లి గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని నెప్పల్లి గ్రామంలో హైస్కూల్ సమీపంలో పోరంబోకు స్థలంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎస్సీ కాలనీవాసులు ఆదివారం రాత్రి విగ్రహాన్ని తెప్పించారు. విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశానికి కూతవేటు దూరంలో మైనార్టీలకు చెందిన నివాసాలు ఉన్నాయి. దీంతో వారు తమ నివాసాలకు దూరంగా ఏర్పాటు చేయాలని సూచించడంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం నెలకొంది. రెండు వైపుల నుంచి ప్రజలు భారీగా మోహరించడంతో ఘర్షణ వాతావరణాన్ని తలపించింది. విషయం తెలుసుకున్న గన్నవరం డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ఎస్ఐ డి. సందీప్, తహసీల్దార్ వి.భావనారాయణ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. హైస్కూల్ గేటు వద్ద నిరుపయోగంగా ఉన్న స్థలంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసేందుకు పంచాయతీ నుంచి పదేళ్ల క్రితమే తీర్మానం కూడా పొందినట్లు ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రారంభోత్సవాలు, విగ్రహాల ఏర్పాట్లు చేయకూడదని సంయమనం పాటించాలని అధికారులు సూచించడంతో వివాదం సద్దుమణిగింది.

### ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించండి

పెనమలూరు: త్వరలో జరగనున్న కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థిని గెలిపించే విధంగా పార్టీ నాయకులు, శ్రేణులు పని చేయాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పోరంకిలో సోమవారం ఎన్డీఏ నేతలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్డీఏ బలపర్చిన అభ్యర్థి ఆలపాటి రాజా గెలుపునకు పార్టీ శ్రేణులు పని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పరుచూరు అశోక్‌బాబు, టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడు మాద్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకర్ బాబు, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

### • మంచు కురిసే వేళలో..





రామవరప్పాడు పరిసర ప్రాంతాలను సోమవారం మంచు దుప్పటి కమ్మేసింది. ఉదయం ఎనిమిది వరకు మంచు తెరలు వీడలేదు. దీంతో వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. మంచు పరదాల్లో నుంచి ఉదయిస్తున్న సూర్యుడు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాడు. ఈ అందమైన చిత్రాలను సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

### అసాంఘిక కార్యకలాపాలపై డ్రోన్లతో నిఘా

హనుమాన్‌జంక్షన్ రూరల్: చట్ట విరుద్ధంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్‌జంక్షన్ ఎస్ఐ వి. సురేష్ హెచ్చరించారు. హనుమాన్ జంక్షన్‌లోని పలు ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు సోమవారం డ్రోన్ల ద్వారా పరిశీలన చేశారు. రైల్వే స్టేషన్, బైపాస్ రోడ్డు, పెరికీడు ఫ్లైఓవర్ బ్రిడ్జి, పట్టణ శివారుల్లోని ప్రాంతాల్లో పోలీస్ శాఖ ఐటీ విభాగం సిబ్బంది, ఎస్ఐ సురేష్ డ్రోన్ల ద్వారా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ అసాంఘిక శక్తుల ఆటలు అరికట్టేందుకు డ్రోన్ల పర్యవేక్షణ నిరంతరంగా జరుగుతుందని పేర్కొన్నారు.

### ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: పెద్ద అవుటపల్లి–వీరపనేనిగూడెం రహదారిలో ఆటో బోల్తాపడిన ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం మండలం తెంపల్లి గ్రామానికి చెందిన ఆవల నాగమణి మరో ముగ్గురు వ్యక్తులు సోమవారం సాయంత్రం పెద్ద అవుటపల్లిలో వీరపనేనిగూడెం వెళ్లే ఆటో ఎక్కారు. మార్గమధ్యలో బ్లూ వైట్ కంపెనీ సమీపంలో ఆటో అదుపు తప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో నాగమణికి కాలు ఫ్యాక్చర్ అయింది. నాగేంద్రమ్మ, రాంబాబులు గాయపడ్డారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారయ్యాడు. క్షతగాత్రులు చిన్న అవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆత్కూరు ఎస్ఐ చావ సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### కారు ఢీకొని స్టాఫ్‌నర్స్ ఇన్‌చార్జికి గాయాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో స్టాఫ్‌నర్స్ ఇన్‌చార్జి గాయపడిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉప్పులూరుకు చెందిన చోడవరపు సోనీ (37) విజయవాడ సిటీ న్యూరో సెంటర్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్ ఇన్చార్జిగా పనిచేస్తున్నారు. ఆమె భర్త మోజెస్ కోఆపరేటివ్ సొసైటీలో పనిచేస్తున్నారు. సోమవారం సాయంత్రం సోనీ విధులు ముగించుకుని తన ద్విచక్రవాహనంపై ఇంటికి బయలుదేరారు. గుణదల విద్యుత్ సౌధ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. తలకు బలమైన గాయం తగలటంతో గాయపడిన సోనీని చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. హాస్పిటల్ నుంచి వచ్చిన సమాచారం మేరకు గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త సుధారాణి, ఏఓ రజని

గన్నవరం రూరల్: పంటల్లో సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్త డి.సుధారాణి పేర్కొన్నారు. మండలంలోని బల్లిపర్రులో మొక్కజొన్న, మినుము పంటలను వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటలకు విచక్షణా రహితంగా పురుగు మందులు వాడరాదన్నారు. రైతాంగం పురుగు మందులను ఆశ్రయిస్తే భూమికే నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. మినుము పైరును పరిశీలించి కాండం ఈగ, బూడిద తెగులును గుర్తించారు. వీటికి ఏస్పేట్, కాంటాఫ్ కలిపి పిచికారి చేయాలని సూచించారు. పచ్చిరొట్ట పైరులను సాగుచేయడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. ఏఓ రజని, వీఏఏ శివనాగరాజు, రైతులు పాల్గొన్నారు.

# భక్తుల కల్పవల్లి.. వీరమ్మతల్లి

- ఈనెల 8 నుంచి ప్రారంభం కానున్న తిరునాళ్లు
- శరవేగంగా ఏర్పాట్లు
- ఆలయ కమిటీ సభ్యులతో ఆర్డీఓ సమీక్ష



శ్రీపారుపూడి కనక చింతయ్య సమేత వీరమ్మతల్లి

ఉయ్యూరు: ప్రసిద్ధిగాంచిన ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్లు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కల్పవల్లిగా పూజలందుకుంటున్న అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ప్రతి ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన ప్రారంభమై 15 రోజుల పాటు అంగరంగ వైభవంగా జరుగుతాయి. అమ్మవారు తొలిరోజు మెట్టినింటి నుంచి పల్లకిలో ఊరేగింపుగా బయలుదేరడంతో ఉత్సవాలకు అంకురార్పణ జరుగుతుంది. కనక చింతయ్య సమేతంగా వీరమ్మతల్లి పట్టణంలో గ్రామోత్సవం పూర్తి చేసుకుని తిరునాళ్ల ప్రారంభమైన రెండో రోజు ప్రధాన సెంటరులోని ఊయల స్తంభం వద్ద ఊయల ఉత్సవం జరుపుకొంటారు. అనంతరం ఆలయ ప్రవేశం చేసి భక్తుల పూజలందుకుంటారు. తిరునాళ్లకు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు హాజరవుతారు. తొలిరోజు అమ్మవారు మెట్టినింటి నుంచి బయలుదేరే ముందు ఎదురుగండ దీపాలతో భక్తులు హారతులు ఇచ్చి ఘన స్వాగతం పలుకుతారు. ఉపవాస దీక్షతో తిరుగుడు గండ దీప భక్తులు అమ్మవారి గ్రామోత్సవంలో ఊరేగింపుగా సాగుతూ మొక్కులు చెల్లించుకుని భక్తిపారవశ్యం చెందుతారు. తిరునాళ్ల ప్రారంభమైన 11వ రోజు శిడిబండి వేడుక ప్రధానమైనది. ఉయ్యూరు ఎస్సీ కాలనీ నుంచి పెండ్లి కుమారుడు ఊరేగింపుగా తరలివచ్చి ప్రత్యేకంగా తయారు చేసిన శిడిబండి బుట్టలో కూర్చుని శిడి ఆడించే వేడుక సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఈ వేడుకకు అశేష భక్తజనం తరలివచ్చి కనులారా వీక్షించి తన్మయత్వం చెందుతున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు శరవేగంగా నిర్వహిస్తోంది.

**పకడ్బందీగా తిరునాళ్లు**

వీరమ్మతల్లి తిరునాళ్లు పకడ్బందీగా నిర్వహించాలని ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ సూచించారు.



వీరమ్మతల్లి ఆలయంలో సమీక్ష చేస్తున్న ఆర్డీఓ హెలా షారోన్

అమ్మవారి తిరునాళ్ల సందర్భంగా ఆలయం వద్ద సోమవారం సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష చేశారు. ఆర్డీఓ షారోన్ మాట్లాడుతూ తిరునాళ్లకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదన్నారు. తిరునాళ్లు ప్రారంభమయ్యే ఎనిమిదో తేదీ నాటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. బారికేడ్లు ఏర్పాటు చేయాలని, తాగునీరు, పార్కింగ్, విద్యుత్ లైట్లు, పారిశుద్ధ్య చర్యలు, వైద్య సహాయక శిబిరాలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. తిరునాళ్లలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్నా ఆలయ కమిటీదే పూర్తి బాధ్యత అని స్పష్టంచేశారు. సమావేశంలో కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సురేష్ కుమార్, ఎంపీడీఓ శేషగిరిరావు, ఎస్ఐ విశ్వనాథ్ పాల్గొన్నారు.

## రథసప్తమి వేడుకలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీ సూర్యనారాయణస్వామి

గన్నవరం రూరల్: మండలంలోని చిక్కవరం శ్రీ క్షేత్ర హనుమత్‌పురం రథసప్తమి వేడుకలకు ముస్తాబు అయింది. సోమవారం శ్రీ సూర్యనారాయణ స్వామిని అలంకరించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. మంగళవారం ఉదయం నుంచి విశేష పూజలు జరుగుతాయని ఆలయ నిర్వాహకుడు చిట్టినేని వంశీ తెలిపారు. ఉదయం ఆరు గంటలకు సూర్యకిరణ స్పర్శ దర్శనం, చిన్న పిల్లలచే సామూహిక సూర్య నమస్కారాలు చేయించనున్నట్లు చెప్పారు. 108 మందితో దేవాలయాల వద్ద స్వామివారికి సామూహిక పాలపొంగళ్ల అనంతరం శ్రీ ఉషా, పద్మినీ సమేత సూర్యనారాయణస్వామి కల్యాణం వైభవంగా జరుగుతుందని వివరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

**పోరంకిలో..**

పెనమలూరు: పోరంకి సూర్య దేవాలయంలో రథసప్తమికి ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రంలో రెండవ సూర్య దేవాలయంగా ఉన్న పోరంకి ఆలయంలో సూర్య జయంతి రథసప్తమి సందర్భంగా భక్తుల కోసం ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మంగళవారం సూర్య కిరణాలు నేరుగా ఆలయంలో స్వామివారి పాదాలను తాకుతాయి. రథసప్తమి సందర్భంగా వేకువజామున మూడు గంటలకు సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, స్వామివారికి విశేష అలంకరణ చేస్తారు. ఉదయం 11 గంటలకు ఉషా ఛాయా సమేత శ్రీసూర్యనారాయణ స్వామివారికి దివ్య కల్యాణం చేస్తారు. ఈ కల్యాణ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆలయ కమిటీ కోరింది.

## ఘనంగా వసంత పంచమి వేడుకలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక గుడివాడరోడ్డులోని సత్యసాయి సేవా సమితి ప్రాంగణంలో గల సరస్వతి అమ్మవారి దేవస్థానంలో వసంత పంచమి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయంలో బాల వికాస్, అంగన్‌వాడీ చిన్నారులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాసం చేశారు. సరస్వతీ పూజ, భజన సత్సంగం, మంగళహారతి కార్యక్రమానికి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరైయ్యారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు. అలాగే బాపులపాడు మండలం వీరవల్లిలోని వాణి విద్యానికేతన్‌లో వసంతి పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ప్రిన్సిపాల్ నందిగం రవికుమార్, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: వసంత పంచమి పర్వదినాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఆలయాల్లో విశేష పూజలు జరిపించారు. సరస్వతీదేవికి విద్యార్థులు భక్తితో ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వసంత పంచమి విశిష్టతను ఉయ్యూరు ఇంగ్లీష్ మీడియం స్కూల్ డైరెక్టర్ ఎంకే బాబు వివరించారు.



ఉయ్యూరులో సరస్వతీ దేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు

**యనమలకుదురులో...**

పెనమలూరు: వసంత పంచమి సందర్భంగా యనమలకుదురు రామాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. పెనమలూరు మండల ఆర్యవైశ్య కమిటీ ఆధ్వర్యంలో చినవంతెన రామాలయం వద్ద చిన్నారులు సామూహిక సరస్వతీదేవి పూజలు నిర్వహించారు. అమ్మవారికి పూలు, పండ్లు సమర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు బుద్ధా లక్ష్మణకుమార్, తటపర్తి సతీష్, తాతా వెంకట కిషోర్, చక్కా లక్ష్మణరాయుడు, కంచర్ల కృష్ణ, నాళ్ల శ్రీనివాసరావు, బచ్చు నరసింహారావు, నంబూరు శ్రీనివాసరావు, భక్తులు పాల్గొన్నారు.

### మహిళా వైద్యులకు సత్కారం



ఉయ్యూరు: జాతీయ మహిళా వైద్యుల దినోత్సవాన్ని మండలంలోని గండిగుంట కమ్యూనిటీ హెల్త్ సెంటరులో సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ ఆధ్వర్యంలో మహిళా వైద్యులు డాక్టర్ తేజస్విని, డాక్టర్ నాగస్వరూప రాణి, డాక్టర్ రోహిణిలను ఘనంగా సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు, ఏఓ లోయ శివశంకర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.